
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.0, కనిష్ఠం 15.4



నిజామాబాద్
జిల్లా వార్తలు
5
గురువారం 4 డిసెంబరు 2025

మీడియా సెంటర్ పరిశీలన

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని స్ర్టాంగ్ రూమ్ మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) సెల్‌ను ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్ లాల్ బుధవారం పరిశీలించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చే చెల్లింపు వార్తలను జాగ్రత్తగా పరిశీలించాలని సూచించారు. అనంతరం స్ర్టాంగ్ రూమ్‌ను సందర్శించి భద్రతా ఏర్పాట్లు, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. ఆయన వెంట డీపీవో శ్రీనివాస్ రావు, డీఆర్డీవో సాయాగౌడ్, ఎంసీఎంసీ సెక్రెటరీ ఎస్.పద్మశ్రీ, హౌసింగ్ పీడీ పవన్‌కుమార్ తదితరులు ఉన్నారు.



రైల్వే స్టేషన్ ఎదుట ఎండలో నిలుచున్న ప్రయాణికులు

నిలువ నీడ లేదాయే..

- ఎండలోనే బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ
- నగరంలోని రైల్వే స్టేషన్ ఎదుట షెడ్డులేక తప్పని అవస్థలు

8



ఉపాధి కోసం నగరానికి వస్తున్న వలస కూలీలు

జీవన చక్రంలో తిరుగుతూనే..!

- ఉపాధి కోసం జిల్లాకు తరలివస్తున్న వలస కూలీలు
- వ్యవసాయ, భవన నిర్మాణ పనుల్లో మధ్యప్రదేశ్, బిహార్ వాసులు

6



కలెక్టర్ ఎదుట ప్రదర్శన ఇస్తున్న దివ్యాంగుడు రవి

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవంలో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

8



గోవింద్‌పేట్‌లో నామినేషన్ సెంటర్‌ను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలి..

- పోలీసు కమిషనర్ సాయిచైతన్య

ఆర్మూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటలకు ఆస్కారం లేకుండా పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా పోలీస్ కమిషనర్ సాయిచైతన్య అన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో బుధవారం గ్రామ పంచాయితీ కార్యాలయం, ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అక్కడ ఎన్నికల సందర్భంగా తీసుకుంటున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సీపీ సాయిచైతన్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రతిష్ఠమైన బందోబస్తు ఏర్పాటు చేసి శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను అమలు చేయాలన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ఠమైన బందోబస్తు నిర్వహిస్తామన్నారు. పోలింగ్ సిబ్బందికి నామినేషన్ కేందారనికి సమీపంలో వంద మీటర్ల వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటలు జరగకుండా చూడాలని, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ ప్రకారం అన్ని మండలాలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు. సమస్యాత్మకమైన ప్రాంతాలను గుర్తించి బందోబస్తు ఏర్పాటు చేసి పెట్రోలింగ్ నిర్వహిస్తారని సీపీ సాయిచైతన్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, ఆర్‌వో నర్సయ్య, ఏఆర్‌వో శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి సుకన్య, ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ తనిఖీ

- రికార్డులను పరిశీలించిన సీపీ
- ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచన

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను బుధవారం సీపీ సాయి చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు సజావుగా జరిగేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని, పాత నేరస్తులను గుర్తించి బైండోవర్ చేయాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులు, బ్యారక్లు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై ఆరాతీశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాద ప్రవర్తించాలని, ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసి ఫిర్యాదుదారుడికి కాపి ఇచ్చి సంతకం తీసుకోవాలన్నారు. సైబర్ క్రైంపై పాఠశాలలో, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సీపీ సాయిచైతన్య సిబ్బందికి సూచించారు.



ఆర్మూర్ బల్దియాలో అక్రమాలు ఎన్నో..!

నేతల మాటల యుద్ధంతో అవినీతి బహిర్గతం

- తప్పుడు ఇంటినంబర్లు కేటాయించి లక్షల రూపాయల వసూళ్లు
- గత ప్రభుత్వ హయాంలో అనేక అక్రమాలు
- అవినీతిని పెంచిపోషిస్తున్న ప్రజాప్రతినిధులు

జిల్లాలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తర్వాత కీలకమైన ఆర్మూర్ మునిసిపాలిటీ అవినీతి అక్రమాలకు అడ్డాగా మారింది. ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఇంటినంబర్ల కేటాయింపు కోసం రూ.20వేలు తీసుకుంటూ పట్టుబడిన ఘటన అటు అధికార పక్షం, ఇటు ప్రతిపక్షాలకు ఆయుధంగా మారి ప్రస్తుతం ఆర్మూర్ రాజకీయాలను ప్రభావితం చేసే స్థాయికి వెళ్లింది.

నిజామాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని ఆర్మూర్ మునిసిపాలిటీలో అనేక అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఆర్మూర్ పట్టణంలో కొత్తగా ఏర్పాటు చేసిన వెంచర్‌లలో 10 శాతం అభివృద్ధి కోసం వదిలేసిన భూములను సైతం వదలకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టి వాటికి ఇంటి నంబర్‌లు కేటాయించిన అంశంలో ప్రజాప్రతినిధుల హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా జిరాయత్‌నగర్, మామిడిపల్లి, పెర్కిట్, కోటార్మూర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వెంచర్‌లలో అనేకం అసైన్డ్ భూములలో ఏర్పాటయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ఉన్న మున్సిపల్ పాలకవర్గంలో ప్రజా ప్రతినిధి భర్త తప్పుడు ఇంటి నంబర్‌ల కేటాయింపులో కీలకపాత్ర పోషించినట్లు తెలుస్తోంది. ఆర్మూర్‌లో 700లకు పైగా ఇంటి నంబర్‌లను గత ప్రభుత్వ పాలక వర్గ హయాంలోనే చేయడం వాటి వెనక అప్పటి ప్రజాప్రతినిధి భర్త ఉన్నట్లు విమర్శలు ఉన్నాయి. తప్పుడు ఇంటి నంబర్ల కేటాయింపులో ముఖ్యపాత్ర పోషించిన సదరు ప్రజాప్రతినిధి భర్త అప్పుడు బీఆర్‌ఎస్‌లో ఉండి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరడం అప్పటి అక్రమాలను కప్పిపుచ్చుకోడానికే అనే విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం ఆర్మూర్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్న గతంలో మున్సిపల్ పాలక వర్గంలో కీలక స్థానంలో ఉన్న వ్యక్తుల హయాంలోనే అవినీతి జరగగా వారు ప్రస్తుతం వినయ్‌రెడ్డి వెంట ఉండడం ప్రజలు నవ్వుకునేలా చేస్తుంది. గతంలో అవినీతి చేసినవారే వాటిని కప్పిపుచ్చుకునేందుకు ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో చేరడంపై విమర్శలు వస్తున్నాయి. అవినీతి ఆరోపణల మీదనే అవిశ్వాస తీర్మానంపెట్టిన ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నేతలు తిరిగి వారిని పార్టీలో చేర్చుకోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి నంబర్ల వెనక మాజీ ప్రజాప్రతినిధి భర్త

బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండో సారి ఆర్మూర్ మున్సిపాలిటీని బీఆర్‌ఎస్ కైవసం చేసుకుంది. ఆ పాలకవర్గంలో కీలకస్థానంలో ఉన్న ప్రజా ప్రతినిధి భర్త 2020 నుంచి 2023 డిసెంబరు వరకు ఆర్మూర్ ప్రాంతంలో 700లకు పైగా తప్పుడు ఇంటి నంబర్‌లకు అనుమతులు ఇచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా ఏర్పడిన వెంచర్‌లతో పాటు అసైన్డ్‌మెంట్ భూముల్లో ఏర్పడిన వెంచర్‌లకు మొదట ఇంటి నంబర్‌లు ఇచ్చి ఆ తర్వాత బై నంబర్‌లు ఇస్తూ అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమతి లేకుండా అసైన్డ్‌మెంట్ భూముల్లో ఏర్పడిన

పైసాలేనిది పనికాదు..

ఇటీవల ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు ఏసీబీకి పట్టుబడగా ప్రజలు సంబరాలు చేసుకున్నారు. పని ఏదైనా.. డబ్బులు ముట్టనిదే ఆర్మూర్ మున్సిపాలిటీలో పనులు కావనేది జగమెరిగిన సత్యం. పాలకవర్గం లేకపోవడంతో గత యేడాది కాలంగా మున్సిపల్ కమిషనర్ రాజు చెప్పిందే వేదం, చేసిందే చట్టంగా సాగింది. స్థానిక అధికార పార్టీ నేత అండదండలతో అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేని భవనాలకు నోటీసులు ఇవ్వడం.. ఆ తర్వాత వసూళ్లకు పాల్పడడం ఆ కమిషనర్‌కు అలవాటైన పనిగా ప్రజలు చర్చిం చుకుంటున్నారు. ఇటీవల పంత్ రోడ్‌లో మున్సిపల్ మడిగెలకు వేలం పాట జరగగా షాప్‌లు దక్కినవారు రూ.20వేలు ఇవ్వనిదే వాటిని కేటాయించలేనట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాం లో అవినీతి చేసినవారంతా ప్రస్తుతం అధికార పార్టీలో చేరడంతో వారిని ప్రశ్నించేవారే లేకుండా పోయిందని పట్టణ వాసులు వాపోతున్నారు.

మిగతా 8వ పేజీలో...



గుత్పలో నామినేషన్ల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్

పంచాయతీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

మాక్లూర్, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని గుత్ప గ్రామ పంచాయితీ కార్యాలయంలో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియను కలెక్టర్ తనిఖీ చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్‌ల ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలన్నారు. మొదటి రోజు సర్పంచ్, వార్డు స్థానాలకు దాఖలైన నామినేషన్‌ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్‌ల స్వీకరణ స్క్రుటినీ అప్పీళ్ల పరిష్కారం, గుర్తుల కేటాయింపు, పోటీ చేసే అభ్యర్థుల ప్రకటన తదితర ప్రక్రియలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేస్తు సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఓటు చోరీకి పాల్పడుతున్న బీజేపీ

- డీసీసీ అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి

8

రోటరీ క్లబ్‌తో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

8





లిఫ్టుల వద్ద రోగులు, సహాయకులు

అమ్మో ఏడంతస్తులా..?

- జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేయని లిఫ్టులు
- రోగులు, సహాయకుల ఇబ్బందులు
- రోజు వెయ్యికి పైగా ఓపీ నమోదు
- వందలాది మందితో ఆస్పత్రి కిటకిట
- మరమ్మతులు మరిచిన అధికారులు

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి నిర్వహణ సరిగా లేక అంధవికారంగా మారుతోంది. ఆస్పత్రిలో మరమ్మతుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించినా టెండర్ ప్రక్రియలో ఆలస్యం కావడంతో పనులు మరింత ఆలస్యమవుతున్నాయి. జిల్లా కేంద్రలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుబంధంగా ప్రభుత్వ ఆసుపత్రిని 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఏడంతస్తులతో సుమారు 500 పడకలతో భవన నిర్మాణం చేపట్టి అట్టహాసంగా ప్రారంభించారు. అప్పటి నుంచి మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఒక్కొక్కటిగా శిథిలావస్థకు చేరుతున్నాయి. అధునాతన సౌకర్యాలతో సుమారు 15నుంచి 20మంది ఒకే లిఫ్టులో పట్టేలా ఒక్కో లిఫ్టును ఏర్పాటు చేశారు. 500 పడకలుగా ఉన్న జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం 750 పడకలుగా మారింది. పడకలు పెరిగినా ఇందుకు అవసరమైన లిఫ్టులను పెంచాల్సి ఉండగా ఉన్నవే పనిచేయక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఓపీ సేవలు రోజుకు వెయ్యి నుంచి 1500వరకు చేరుకుంది. నిత్యం రోగులతో రద్దీగా మారడంతో లిఫ్టుల వద్ద రద్దీ నెలకొంటుంది. ఏడంతస్తుల మేడ కావడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో నాలుగు చోట్ల 2చొప్పున 8లిఫ్టులను ఏర్పాటు చేశారు. 2 లిఫ్టులు డైట్ నుంచి నేరుగా ఆసుపత్రిలోని పైన అంతస్తులకు వెళ్లేందుకు అనుసంధానం చేశారు. మిగిలిన 8లిఫ్టులలో 2లిఫ్టులు వైద్య సిబ్బందికి ఉపయోగిస్తుండగా, 6లిఫ్టులు రోగులకు కోసం కేటాయించారు. ఇందులో ప్రస్తుతం కేవలం 2 లిఫ్టులు రోగుల కోసం వాడుతున్నారు. మిగిలిన 4లిఫ్టులు ప్రస్తుతం ఉపయో గంలో లేవు. లిఫ్టు ఆపరేటర్‌లు లేకపోవడమా, లిఫ్టులకు మరమ్మతు లు చేయలేక పోవడమా తెలియదు గాని మిగిలిన లిఫ్టులు మాత్రం పనిచేయడం లేదు. రోజు వెయ్యిమందికి పైగా ఓపీతో పాటు వందలాది మంది వివిధ చికిత్సల నిమి త్తం ఆసుపత్రిలో ఆయా విభాగాలో ఇన్ పేషెంట్‌లుగా ఉంటున్నారు. వీరితోపాటు రోగి సహాయకులు సైతం ఆసుపత్రిలో ఉండాల్సి

మిగతా 8వ పేజీలో...



మొదటి విడత ప్రచారం షురూ

- ముగిసిన మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ
- ప్రారంభమైన మూడో విడత స్వీకరణ
- మొదటి విడతలో 22 గ్రామ పంచాయతీల ఏకగ్రీవం

నిజామాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మొదటి విడత గ్రామ పంచాయతీ, వార్డు సభ్యుల ఉపసంహరణ గడువు బుధవారం ముగియడంతో పోటీలో ఉండే అభ్యర్థులకు సాయంత్రం ఎన్నికల గుర్తులను కేటాయించారు. దీంతో మొదటి విడత ఎన్నికలు జరుగుతున్న గ్రామ పంచాయతీ, వార్డు స్థానాలకు పోటీలో ఉన్న అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీంతో ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో పండగ వాతావరణం నెలకొంది. అభ్యర్థులు పోటాపోటీగా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎత్తులకు పైఎత్తులు వేస్తున్నారు. ఈ నెల 11న మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు 11 మండలాల్లో 184 గ్రామ పంచాయతీలు, 1642 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మొదటి విడత నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగియడంతో 22 గ్రామ సర్పంచ్ స్థానాలు, అనేక వార్డులు కూడా ఏకగ్రీవం అయ్యాయి. నామినేషన్‌ల ఉపసంహరణ గడువు ముగియడంతో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను బుధవారం సాయంత్రం 5 గంటల తర్వాత అధికారులు ప్రకటించారు. అనేకచోట్ల ఎక్కువమంది అభ్యర్థులు పోటీపడుతుం డడంతో పోటీ రసవత్తరంగానే మారనుంది. మూడు ప్రధాన పార్టీలు బలపర్చిన అభ్యర్థుల మధ్యే పోటీ ఉండనుంది. గురువారం నుంచి ఈ నెల 11 పోలింగ్‌కు ముందు రోజు బుధవారం సాయంత్రం 5 గంటల వరకే ప్రచారానికి అనుమతి ఉండడంతో వారం రోజులే అభ్యర్థులు ప్రచారం చేసుకునేందుకు గడువు ఉంది. దీంతో అభ్యర్థులు తమకు కేటాయించిన గుర్తులతో కరపత్రాలు, గోడ ప్రతులను ముద్రించుకుని ఓటర్ల వద్దకు

మిగతా 8వ పేజీలో...

క్రైం సమాచారం

దాడిలో ఒకరి మృతి.. నిందితుడికి రిమాండ్

మాక్లూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గుత్పలో జరిగిన ఘర్షణలో సంతోష్ అనే వ్యక్తి(26) మృతిచెందగా.. దాడికి కారకుడైన వ్యక్తిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గుత్పలో సోమవారం రాత్రి బిహార్ హమాలీలు సంతోష్, గుడ్డు కువర్‌మధ్య భోజన సమయంలో గొడవ జరిగింది. ఇందులో గుడ్డు కుమార్ సంతోష్‌ను దొరకబట్టి తలను సిమెంట్ బెస్‌మెంట్‌కు బలంగా కొట్టాడు. దీంతో తీవ్ర గాయాలైన సంతోష్‌ను తోటి హమాలీలు 108లో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందాడు. మృతికి కారకుడైన గుడ్డు కుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

బోధన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడాపల్లికి చెందిన దేవరాజు(28) మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మేరే దేవరాజ్ మంగళవారం తన స్నేహితులు దుబాయ్ నుంచి వచ్చారని, వారిని కలిసి వస్తానని ఇంట్లో చెప్పి బైక్ మీద వెళ్లాడు. సాయంత్రం గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా లంగ్దాపూర్ శివారులో గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి భార్య దివ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేశారు. మృతుడికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు.

జాతీయ రహదారిపై లారీ బోల్తా

మెండోరా, డిసెంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలో బుస్సాపూర్ జాతీయ రహదారిపై ఆలుగడ్డల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. నిర్మల్ నుంచి ఆర్మూర్ వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడటంతో.. క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ చాకచాక్యంగా లారీ అద్దాలు పగలగొట్టుకొని స్వల్ప గాయాలతో బయటపడ్డారన్నారు. డీజిల్ ట్యాంక్ నుంచి డీజిల్ లీక్ అవడంతో స్థానిక ప్రజలు ఆందోళన చెందారు. పక్కనే ఉన్న నివాసాల నుంచి మోటార్ పైప్ ద్వారా నీటితో లారీకి మంటలు చెలరేగకుండా ముందు జాగ్రత్తగా నీటిని పట్టడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఆలూర్‌లో దొంగల బీభత్సం

- తాళం వేసిన ఇంట్లో చోరీ
- 12 తులాల బంగారం, అర కిలో వెండి, రూ.లక్ష నగదు అపహరణ

ఆలూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసిన ఇంట్లో దొంగలు చొరబడి భారీగా బంగారం, వెండి, నగదు చోరీ చేసినట్లు బాధితుడు రాము తెలిపారు. వారి కథనం ప్రకారం.. కట్టె మిషన్ పుల్లెల రాము, అతడి భార్యాపిల్లలతో నవంబరు 27న ఇంటి నుంచి మధ్యాహ్నం వారి మామ దినకర్మలకు వేరే ఊరికి వెళ్లారు. డిసెంబరు 2న సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా గేటుకు వేసిన తాళం అంతే ఉంది. కానీ ఇంటి తలుపు తాళం ధ్వంసం చేసి ఉండటంతో లోపలికి వెళ్లి చూశారు. ఇంట్లోని బీరువా, డ్రెసింగ్ టేబుల్‌ను పగలగొట్టి అందులో ఉన్న 12 తులాల బంగారం, సుమారు 500 గ్రాముల వెండి, లక్ష రూపాయల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని గుర్తించారు. దీనిపై బాధితులు పోలీసులకు సమాచారం అందించగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

జింకను చంపిన నలుగురిపై కేసు

నిజామాబాద్ రూరల్, డిసెంబర్ 03 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం మల్లారం అటవీ ప్రాంతంలోని జింకను చంపినట్లు స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రూరల్ సీఐ శ్రీనివాస్ విచారణ చేపట్టగా.. బోర్గాం గ్రామానికి చెందిన గంధం విజయ్, దాసరి వెంకట, నిమ్మల భూమయ్య, అనిల్ అనే నలుగురు వ్యక్తులు ఈ దురాఘతానికి పాల్పడ్డట్లు తెలిసింది. వారిని విచారించగా.. నలుగురు కలిసి వారం క్రితం మల్లారం అటవీ ప్రాంతంలో జింకను వలవేసి పట్టుకున్నట్లు తెలిపారు. దానిని చంపి మాంసం, చర్మం తీసుకెళ్లినట్లు విచారణలో ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ వివరించారు.

కామారెడ్డిలో కత్తిపోట్ల కలకలం

- మునిసిపల్ పరిధిలోని రామేశ్వర్ పల్లిలో ఘటన

కామారెడ్డిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మునిసిపల్ పరిధిలోని రామేశ్వర్‌పల్లి శివారులో మంగళవారం అర్ధరాత్రి ఓ యువకుడు కత్తిపోట్లకు గురైన ఘటన కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామేశ్వర్‌పల్లి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో నివాసం ఉండే సుతారి రాజశేఖర్(30), అదే ప్రాంతంలో నివాసం ఉండే గంగణి ప్రవీణ్‌లు సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మద్యం సేవించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవకు దారితీయగా అప్పటికే ప్రవీణ్ వద్ద ఉన్న కత్తితో రాజశేఖర్ పొట్టలో పొడిచాడు. దీంతో రాజశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. రాజశేఖర్ కేకలు వేయడంతో స్థానికులు స్పందించి అతణ్ని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని రూరల్ సీఐ రామన్ సందర్శించి ప్రవీణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

లింగంపేట, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): లింగంపేట మండలంలోని నల్లమడుగు చౌరాస్తాలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు మృతిచెందింది. లారీ, బైక్ ఢీకొనడంతో కొండ ఈరవ్వ(65) మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయని, క్షతగాత్రున్ని హైదరాబాద్‌కు తరలించినట్లు ఎస్సై దీపక్‌కుమార్ తెలిపారు. వివరాలు.. నల్లమడుగు తండాకు చెందిన దానావత్ దూప్‌సింగ్, నల్లమడుగుకు చెందిన కొండ ఈరవ్వ బైక్‌పై లింగంపేట నుంచి నల్లమడుగుకు బయలుదేరారు. నల్లమడుగు చౌరస్తా వద్దకు రాగానే ఓ లారీ వెనుక నుంచి బైక్‌ను ఢీ కొంది. దీంతో బైక్‌పై నుంచి పడిపోయిన ఈరవ్వ రెండు కాళ్లపై నుంచి లారీ వెళ్లింది. దూప్‌సింగ్‌కు తీవ్ర గాయాలవడంతో ఇద్దరినీ 108లో కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఈరవ్వ మృతి చెందగా, దూప్‌సింగ్ పరిస్థితి విషమంగా మారింది. దీంతో ఆయనను హైదరాబాద్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మూడో విడత నామినేషన్ల జోరు

ఏర్గట్ల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడతలో బుధవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. కాగా ఏర్గట్ల మండలంలో మొత్తం 9 సర్పంచ్, 13 వార్డులకు నామినేషన్లు దాఖలయ్యాయి. బట్టాపూర్ సర్పంచ్ స్థానానికి 3, దోంచంద 1, గుమ్మిర్యాల్-1, నాగేంద్రనగర్-1, తొర్తి-2, వార్డులకు తాళ్ళరాంపూర్-1, తొర్తి-3, ఏర్గట్ల-4 స్థానాలకు నామినేషన్ వేసినట్లు ఎంపీవో శివచరణ్ తెలిపారు.

డొంకేశ్వర్: మండలంలోని 13 సర్పంచ్ స్థానాలకు 15 నామినేషన్లు వచ్చాయి. 118 వార్డు సభ్యులకు గాను 22 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో లింగం తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై రామ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

ఆర్మూర్: మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం సర్పంచ్ స్థానాలకు 16 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో శివాజీ తెలిపారు. వార్డు మెంబర్ స్థానాలకు 26 నామినేషన్‌లు దాఖలైనట్లు ఆయన పేర్కొన్నారు.

ముప్కాల్: మండలంలో సర్పంచ్ స్థానాలకు 10 నామినేషన్‌లు దాఖాలు కాగా వార్డు సభ్యుల స్థానాలకు 27 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. బాల్కొండలో సర్పంచ్ స్థానాలకు 7, వార్డు స్థానాలకు 27 నామినేషన్‌లు వచ్చాయని ఎంపీడీవో విజయభాస్కర్ తెలిపారు.

మోర్తాడ్: మండలంలో నామినేషన్‌ల మొదటి రోజున పది గ్రామాలకు సర్పంచ్ స్థానాలకు 9 నామినేషన్‌లు, 27 వార్డు సభ్యులకు అభ్యర్థులు నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో తిరుమల తెలిపారు.

వేల్పూర్: మండలంలోని వివిధ గ్రామాలలో 18 జీపీలకు బుధవారం 8 నామినేషన్‌లు సర్పంచ్ పదవులకు దాఖలైనట్లు ఎంపీడీవో బాలకిషన్ తెలిపారు. వార్డు సభ్యులకు 37 నామినేషన్‌లు దాఖలయ్యాయని తెలిపారు.



నిజామాబాద్ జిల్లాకు వచ్చిన వలస కార్మికులు...



పిల్లలతో వెంట తెచ్చుకున్న మూటలు మోసుకెళ్తున్న దృశ్యం

జీవన చక్రంలో తిరుగుతూనే..!

మనిషి జీవితంలో ముఖ్యమైనవి కూడు, గూడు. అవి లేకుంటే దుర్భర పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుంది. చేయడానికి చేతి నిండా పని ఉంటే ఇవన్నింటిని మానవుడే సృష్టించుకోగలడు.. తన అవసరాలను తీర్చుకోగలడు.. కానీ అవి లేకపోతే పొట్ట చేతబట్టుకొని రాష్ట్రాలు, దేశాలు దాటాల్సిందే. ఇలా వలస వచ్చే ఎందరికో ఉపాధి కల్పిస్తోంది మన ఇందూరు. నిత్యం వందలాది మంది మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ నుంచి కూలీలు వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులుగా ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడ పనులు పూర్తికాగానే మళ్లీ వారి స్వస్థలాకు వెళ్లి కుటుంబాలతో ఆనందంగా గడుపుతారు. తమతో పాటు చాలా మంది మధ్యప్రదేశ్‌లోని చంబల్, గ్వాలియర్, భూపాల్, ప్రాంతాల నుంచి రెండేళ్లుగా కుటుంబాలతో వస్తున్నట్లు సంతోష్ దూబే అనే వలస కార్మికుడు తెలిపారు. ఈసారి జిల్లాకు వచ్చిన తాము వరినాట్లు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు

– ఆంధ్రజ్యోతి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్



పొలంలో నాట్లు వేస్తున్న వలస కూలీలు



మండల పరిషత్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వివరాలు తెలుసుకుంటున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలి

- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

రెంజల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమయంలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అధికారులను ఆదేశించారు. పంచాయతీ ఎన్నికల దృష్ట్యా ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ పనులను బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సర్వీస్ ఓటర్లకు సరైన ఏర్పాట్లు చేయాలని ఫారం 17 నుంచి 20వరకు సరిగ్గా నిర్వహించాలని ఎంపీడీవోను ఆదేశించారు. గురువారం వరకు పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో కమలాకర్, సిబ్బంది తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్

కేంద్రం చర్యలతో రైతులకు నష్టం

- ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్

కమ్మర్‌పల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా రైతులను నష్టపర్చేలా విత్తనాల మార్కెటింగ్, విద్యుత్ బిల్లులను కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు వి.ప్రభాకర్ పేర్కొన్నారు. వెంటనే ఆ బిల్లులను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. బుధవారం కమ్మర్‌పల్లిలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రెండింత ఆదాయాన్ని కల్పిస్తామని హామీలిచ్చి, నిండా ముంచే కార్యక్రమాలను చేపడుతోందని విమర్శించారు. వ్యవసాయ, విద్యుత్ రంగాలు రాజ్యాంగంలో పేర్కొన్నట్లు రాష్ట్రాల పరిధిలో ఉన్నాయని, వాటి హక్కులను కేంద్రం కాలరాస్తూ.. కార్పొరేట్లకు దోచిపెడుతోందని పేర్కొన్నారు. రైతులు తమ హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమించాల్సి సమయం ఆసన్నమయిందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్, నాయకులు అశోక్, వి.బాలయ్య, కే.రాజేశ్వర్, పెద్ది రాజేశ్వర్ తదితరులున్నారు.

నవీపేట రైల్వేగేటు మూసివేత

- నేడు సాయంత్రం 6 వరకు బంద్
- ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని వాహనదారులకు అధికారుల సూచన

నవీపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నవీపేట ప్రధాన రైల్వే గేటును బుధవారం రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వే డబ్లింగ్ పనులలో భాగంగా నవీపేట ప్రధాన రైల్వేగేటును బుధవారం నుంచి గురువారం సాయంత్రం 6గంటల వరకు రైల్వేగేటును మూసి ఉంచనున్నారు. ఈ సందర్భంగా వాహనాలను ఇతర మార్గాల గుండా దారి మళ్లించారు. నిజామాబాద్ నుంచి బాసర వైపు వెళ్లే వాహనదారులు నవీపేట రైల్వేగేటు మూసి ఉండడంతో ప్రత్యామ్నాయ మార్గాల గుండా వెళ్లడానికి ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని రైల్వే అధికారులు, పోలీసులు సూచిస్తున్నారు.



నవీపేట రైల్వేగేటు వద్ద పనులు చేపట్టిన దృశ్యం



డొంకేశ్వర్‌లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

డొంకేశ్వర్/ఆర్మూర్/నందిపేట్/జక్రాన్‌పల్లి,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని జిల్లా ఎన్నికల పరిశీలకుడు శ్యాంప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం డొంకేశ్వర్, ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, నందిపేట, జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్లు కొనసాగుతున్న తీరును ఎంపీడీవోలను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. శిక్షణ సమయంలో అందజేసిన కరదీపికను చదివి దానిని అనుసరించాలని సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీవో శివకృష్ణ, తహసీల్దార్లు నరేష్, సంతోష్, ఎంపీడీవోలు లింగం, శ్రీనివాసరావు, సతీష్‌కుమార్, ఎంపీవోలు శ్రీనివాస్, ఎంపీవో యూసుప్ ఖాన్, జీపీ కార్యదర్శులు శ్రీనివాస్, హరీష్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మునిసిపల్ పరిధి మామిడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం జై మహావిభోశ్రీ జన్మదినాన్ని పురస్కరించుకొని నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. సుమారు 170 మంది విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, పెన్నులు అందజేశారు. భక్తులు శ్రీనివాస్, రూప, రజిని, శృతిక, ప్రవళిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామదేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన



విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న మహిళలు

రుద్రూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామంలో బుధవారం గ్రామ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ఉదయం నుంచి దేవత విగ్రహాల ఊరేగింపు, హోమం, అవహిత పూజలు, శిఖర ప్రతిష్ఠాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఒకే గ్రామం.. ఒకే నామినేషన్

బోధన్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): దేశానికి పల్లెలే పట్టుగొమ్మలు.. అలాంటి పల్లెలు అభివృద్ధి చెందాలంటే ప్రజలందరి సహకారం అవసరం. అందుకే ఎన్నికల్లో ఎలాంటి భేదాభిప్రాయాలు లేకుండా ఒకరినే ప్రతిపాదించి పలు గ్రామాలు ఏకగ్రీవంగా ఎన్నికలను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయా గ్రామాల నుంచి ఒకటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. బోధన్ డివిజన్‌కు సంబంధించిన ఏకగ్రీవ పంచాయతీలు, అభ్యర్థుల ఇలా ఉన్నాయి.

బోధన్ మండలంలో పెంటాఖుర్దు క్యాంప్(వేములపల్లి రాధిక), మావందికలాన్(శకుంతల), పెంటాకలాన్(కర్లం కళావతి), భూలక్ష్మి క్యాంప్(కామిరెడ్డి బాల్‌రెడ్డి). సాలూర మండలంలో.. సాలంపాడ్, (శీలం నర్మద), ఫత్తేపూర్(షేక్ నూరా), సాలూర క్యాంప్(దొండేటి విజయ భాస్కర్ రెడ్డి), ఎడపల్లి మండలంలో బాపునగర్(నగునూరి అనురాధ), నవీపేట మండలంలో నాడాపూర్(ఎండల లక్ష్మి), రెంజల్ మండలంలో దండిగుట్ట(ధనుంజయ్), చందూర్ మండలంలో కారేగాం(లాల్‌సింగ్), వర్ని మండలంలో చేల్‌కా తండా(బొట్టిపాటి శ్రీనివాస్ రావు), సిద్దాపూర్(బాల్‌సింగ్), రూప్లానాయక్ తండా(సిరినా బలరాం), సైద్‌పూర్(నరేందర్), చింతల్‌పేట్(గంగారాం), పోతంగల్ మండలంలో పీఎస్ఆర్ నగర్(రాంబాయి), కోటగిరి మండలంలో రాంపూర్(శాంకీబాయి), సుద్దులం తండా(మౌనిక), దేవునిగుట్ట తండా(కే.రవి), అడ్కాస్‌పల్లి(రెడ్డి రామకృష్ణ) వల్లభాపూర్(పుష్పబాయి).

బోధన్‌లో మాస్టర్ ప్లాన్ సర్వే

బోధన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బోధన్ మునిసిపాలిటీ పరిధిలోని 38 వార్డుల్లో బుధవారం మాస్టర్ ప్లాన్‌కు సర్వే ప్రారంభమైందని, ఈ మేరకు క్షేత్రస్థాయిలో సిబ్బంది సర్వే చేస్తున్నట్లు బోధన్ మునిసిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాస్టర్ ప్లాన్ సర్వేలో భాగంగా సర్వే సిబ్బంది పట్టణంలోని రోడ్లు, నీటి సరఫరా, డ్రైనేజీలు, ఇంటి నంబర్లు, యజమాని వివరాలు, భవన విస్తీర్ణం, మౌలిక సదుపాయల డాటా సేకరణ తదితర అంశాలను సేకరిస్తున్నారని తెలిపారు. అమృత్ 2.0 పథకం కింద ఈ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసేందుకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నామని వివరించారు.



బోధన్ పట్టణంలో క్షేత్రస్థాయి సర్వే దృశ్యం

రేపు సాయుధదళాల పతాక దినోత్సవ ర్యాలీ

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సాయుధ దళాల పతాక దినోత్సవ ర్యాలీని ఈ నెల 5న నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి డి.రవీందర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఎన్‌సీసీ క్యాడెట్స్, మాజీ సైనికులు, సైనిక వితంతువులతో కలిసి జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమానికి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు, మాజీ సైనిక వితంతువులు, మాజీ సైనికులు పెద్దసంఖ్యలో హాజరుకావాలన్నారు. నూతన కలెక్టరేట్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 8.30 గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని తెలిపారు.



నవీపేటలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి



ఆర్మూర్‌లో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈవో



మాక్లూర్‌లో దివ్యాంగుల దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో



రెంజల్‌లో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో అంజనేయులు

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా భవిత కేంద్రాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథులుగా ఆయా మండలాల ఎంఈవోలు హాజరయ్యారు. ప్రముఖులు ప్రసంగాలు చేశారు. దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు అన్నారు. అనంతరం పోటీల్లో విజయం సాధించిన వారికి బహుమతులు అందించారు. – నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి



నందిపేటలో బహుమతులు అందజేస్తున్న ఎంఈవో అవధూత గంగాధర్



ఆర్మూర్‌లో క్రీడాకారున్ని సన్మానిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్ రెడి



వేల్పూర్‌లో మాట్లాడుతున్న ఎంఈవో రేణుక

సతి, పతి సర్పంచులుగా..



ఆర్మూర్, డిసెంబర్ 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల వేళ రిజర్వేషన్ల అంశం కీలక మలుపులకు దారి తీసిన విషయం తెలిసిందే. కాగా రిజర్వేషన్లు కలిసి వచ్చిన వారు మాత్రమే ఎన్నికల్లో బరిలో దిగుతున్నారు. కొన్ని చోట్ల ఎన్నో ఆశలతో పంచాయతీ పోరులో నిలుద్దామనుకున్నవారు చివరికి రిజర్వేషన్లు కలిసిరాకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ రిజర్వేషన్ల పద్ధతే లేని రోజుల్లో జిల్లాలోని ఓ గ్రామంలో ఓ అరుదైన ఘటన జరిగింది. ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో 1995లో గ్రామ సర్పంచ్ సహా, వార్డు మెంబర్లు మొత్తం అతివలే గెలుపొందారు. రాష్ట్రంలోనే పూర్తిస్థాయిలో మహిళలచే ఎన్నుకోబడిన గ్రామ పంచాయితీ గా ప్రచారం జరిగింది. మగ్గిడి సర్పంచ్‌గా చంపబాయి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా వార్డు స్థానాల్లో మహిళలు సైతం ఏకగ్రీవమయ్యారు. మరో ఆసక్తికర విషయమేమిటంటే ఈ ఎన్నికల్లో చంపబాయి మగ్గిడి సర్పంచ్‌గా గెలుపొందగా, ఆమె భర్త గంగాధర్‌రావు ఖానాపూర్ సర్పంచ్‌గా గెలుపొందారు. అయితే భార్యాభర్తలు సర్పంచులుగా ఎన్నికవడం విశేషం.

బాపూ నమస్తే.. అవ్వా నమస్తే



భీమ్‌గల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల ప్రచార హోరు గ్రామాలలో జోరందుకుంది. సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థులు పట్టు సాధించేందుకు ప్రజల్లోకి వెళ్తున్నారు. ప్రతినిత్యం ఉదయం నుండే గ్రామాలలో నమస్తే బాపూ.. నమస్తే అవ్వా అంటూ పలకరింపులతో ప్రతి ఒక్కరి దగ్గరికీ వెళ్తూ మర్యాదగా మెదులుతున్నారు. ఓటుహక్కు కలిగిన ప్రతి ఒక్కరికి చిన్నాపెద్ద తేడా లేకుండా వందనాలతో పలకరించి సర్పంచ్ పోటీ చేస్తున్నానని తనకు ఓటు వేసి గెలిపించాలని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. రచ్చబండల వద్ద సమావేశాలలో, వృద్ధులకు సైతం నమస్తే కాక అంటూ ఆ సమూహంలో చేరి రాజకీయ చర్చలు కొనసాగిస్తున్నారు. గ్రామ పంచాయతీల్లోని వివిధ కుల సంఘాల పెద్దలతో దోస్తీ కలుపుతూ తమకు అనుకూలంగా మలుచుకునేందుకు కుల పెద్దలకు ఇప్పటి నుండే సకల మర్యాదలు చేస్తున్నారు.

అభ్యర్థులకు అకౌంట్ ఇష్యూ



మద్నూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు బ్యాంకు అకౌంటును సమర్పించాలని ప్రభుత్వం నిబంధన విధించడంతో గ్రామ సర్పంచి, వార్డు మెంబర్‌గా పోటీ చేసే అభ్యర్థులు ఆయా బ్యాంకులకు తరలి వస్తున్నారు. మహిళా అభ్యర్థులుగా పోటీ చేసేవారు సైతం తమ చిన్నారులతో అకౌంట్ కోసం వచ్చి ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఆయా బ్యాంకుల్లో అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారి ఖాతాలు ఉన్నప్పటికీ కొత్త ఖాతాలు కావాలని నిబంధన విధించడంతో ముందుగా జాతీయ బ్యాంకుల్లో ఉన్న ఖాతాలు కాకుండా సహకార బ్యాంకుల్లో ఖాతాలను తీస్తున్నారు. బ్యాంకు ఖాతాతో పాటు ధృవీకరణ పత్రాలు కుల ధ్రువీకరణ పత్రాలు గ్రామపంచాయతీ నుంచి నో డ్యూస్ పత్రాలు తీసుకోవాల్సి ఉండటంతో సమయం వృథా అవుతుందని వాపోతున్నారు. అభ్యర్థులకు పాత అకౌంట్ కాకుండా కొత్తగా సేవింగ్ అకౌంట్ తీసుకోవాలని అధికారులు సూచిస్తుండడంతో ఆ అకౌంట్ తీయాలంటే ప్రస్తుతమున్న బ్యాంకు కాకుండా మరో బ్యాంకులో తీయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలి



స్టీల్ గ్లాసులు, గిన్నెలు అందజేస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడకాన్ని నివారించాలని బాన్సువాడ పట్టణంలోని అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు సాయిరెడ్డి అన్నారు. ఆలయంలో దీక్షా స్వాముల కోసం ప్లాస్టిక్ వినియోగించకుండా భిక్ష అందించేందుకు దాతలు ముందుకు వచ్చారు. బుధవారం పోతులబోగుడ శ్రీనివాస్‌రెడ్డి 200 స్టీల్ గ్లాసులు, గురజాల కిరణ్ 200 గిన్నెలను, చెంచాలను ఆలయ కమిటీకి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ.. నెమ్మది నెమ్మదిగా ఆలయంలో ప్లాస్టిక్‌ను నిషేధించే దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. అందుకు సహకరిస్తున్న దాతలు, గురుస్వాములు, దీక్షా స్వాములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ర్యాల విఠల్‌రెడ్డి, సిద్ధి మహేశ్, సాయిలు, ఆనంద్, తదితరులు ఉన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు



దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో బుధవారం దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బీర్కూర్ బాలికల ప్రాథమిక పాఠశాలలో మండలంలోని దివ్యాంగ బాలబాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం దివ్యాంగ బాలబాలికల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వెంకన్న, ప్రధానోపాధ్యాయురాలు ఫణిశ్రీ, పీఆర్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గాప్రసాద్, నాగరాజు, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు శ్రీనివాస్, నాగలక్ష్మి, బాలమణి, పాఠశాలల ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమేష్, లయన్స్ గాలయ్య, విఠల్, రషీద్, దత్తు బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు దత్తపౌర్ణమి వేడుకలు

బాన్సువాడటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చైతన్య కాలనీలో గల దత్త మందిరంలో, శ్రీరామ మందిరంలో , పెద్ద హనుమాన్ మందిరంలో గురువారం దత్త పౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు, డోలారోహణ కార్యక్రమాలుంటాయని తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



పిట్లంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకట్‌రావు

పిట్లం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు నిబంధనలు పాటించాలని ఎస్సై వెంకట్రావు అన్నారు. బుధవారం జగదాంబ తండా గేటు వద్ద పిట్లం బాన్సువాడ రహదారిపై పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని, వాహనానికి సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే వాహనదారులపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ ఉన్నందు వలన నగదు లావాదేవీలను రూ.50 వేలు మించి తీసుకుపోరాదని సూచించారు. పోలీసులు సాయాగౌడ్, వెంకా గౌడ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి మద్నూర్‌లో 33 నామినేషన్లు

మద్నూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంటోంది. కాగా నామినేషన్ల ప్రక్రియ 2 విడతలు పూర్తికాగా బుధవారం మూడో విడత నామినేషన్ల ప్రక్రియ జోరుగా ప్రారంభమైంది. ఉమ్మడి మద్నూర్ మండలంలో మొదటిరోజు 33 మంది సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు వేయగా, 17 మంది వార్డు మెంబర్లకు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రకటించారు. మండలాల వారీగా చూస్తే.. మద్నూర్ మండలంలో 31 సర్పంచ్ స్థానాలకు గాను 27మంది దరఖాస్తు చేసుకోగా, 17 మంది వార్డుమెంబర్లుగా దరఖాస్తు చేసుకున్నారు. డోంగ్లి మండలంలో 13 గ్రామాల్లో ఆరుగురు నామినేషన్లు వేశారు. వార్డు మెంబర్లకు నామినేషన్లు రాలేదని అధికారులు తెలిపారు.

బీర్కూర్‌లో 14 నామినేషన్లు..

బీర్కూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలో 13 గ్రామ పంచాయితీలు ఉన్నాయి. కాగా మూడో విడతలో 17వ తేదీన స్థానిక సంస్థ ఎన్నికలు జరగనున్నాయి. ఇదిలా ఉండగా బుధవారం నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 14, వార్డు స్థానాలకు 23 నామినేషన్లు దాఖలు అయినట్లు సూపరింటెండెంట్ భానుప్రకాష్ తెలిపారు.

బస్సు రాక.. చదువు నడవక

▸ నిత్యం 6 కిలోమీటర్ల కాలినడక ▸ బస్సు నడపాలని గొట్టిముక్కుల విద్యార్థుల వేడుకోలు ▸ కలెక్టర్ ఆదేశించినా తీరని సమస్య

దోమకొండ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ఏవి వచ్చినా సరే అభివృద్ధికి పట్టం కడతాం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం అంటూ ఆయా రాజకీయ పార్టీల నాయకులు హామీల వర్షం కురిపిస్తారు. తీరా ఎన్నికలయ్యాక ఎవరి దారి వారిదే అంటూ సమస్యలు పట్టించుకోరు. దోమకొండ మండలంలోని గొట్టిముక్కుల విద్యార్థులు కళాశాలకు వెళ్లాలంటే కాలినడకే శరణ్యం. నేటికీ సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు.

నిత్యం 6 కిలోమీటర్లు కాలినడక..

గొట్టిముక్కుల గ్రామం నుంచి దోమకొండ మండల కేంద్రం 3 కిలోమీటర్లు దూరం ఉంది. అయితే ఈ గ్రామస్థులు ఏ పనికైనా దోమకొండకు రావాల్సిందే. అయితే విద్యార్థులు చదువుకునేందుకు వెళ్లడానికి ఉదయం 3 కిలోమీటర్లు సాయంత్రం 3 కిలోమీటర్లు కాలినడకన వెళ్తున్నారు. దోమకొండ ప్రభుత్వ కళాశాల బస్టాండ్ నుంచి మరో కి.మీ.కుపైగా ఉంటుంది. గతంలో జిల్లా కలెక్టర్‌కు గ్రామస్థులు ఈ సమస్యపై వినతిపత్రం అందజేసి బస్సు నడపాలని కోరగా ఆర్టీసీ అధికారులకు సూచించారు. అయినా సమస్య పరిష్కారం కాలేదు.

బస్సు సౌకర్యం లేక చదువుకు దూరం..

గొట్టిముక్కుల నుంచి దోమకొండ, కామారెడ్డికి బస్సు ఇతర రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులకు పై చదువులపై ఇష్టం ఉన్నా.. తల్లిదండ్రులు చదువు మాన్పిస్తున్నారు. గ్రామానికి ఉదయం 8 గంటలకు సాయంత్రం 5 గంటలకు బస్సు ట్రిప్పులు వేసి విద్యార్థుల చదువులు ఆగకుండా చూడాలని కోరుతున్నారు.

గ్రామం నుంచి మొత్తం 29 విద్యార్థులు

గొట్టిముక్కుల గ్రామం నుంచి దోమకొండ ప్రభుత్వ పాఠశాల, కళాశాల, కామారెడ్డి కళాశాలకు మొత్తం 29 మంది విద్యార్థులు ఉన్నారు. గతంలో ఉదయం 8 గంటలకు పెద్దమాల్లారెడ్డి నుంచి సంగమేశ్వర్ మీదుగా గొట్టిముక్కుల, దోమకొండ, కామారెడ్డికి, తిరిగి సాయంత్రం 5 గంటలకు కామారెడ్డి నుంచి దోమకొండ, గొట్టిముక్కుల పెద్దమాల్లారెడ్డి బస్సు వెళ్లేది. భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురికాగా అధికారులు బస్సు బంద్ చేశారు. రోడ్డు మరమ్మతులు చేపట్టి నెలలు గడుస్తున్న అధికారులు బస్సు సౌకర్యం కల్పించడంలో విఫలమౌతున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఇబ్బందులు పడుతున్నాం



కళాశాలకు వెళ్లాలంటే బస్సు సౌకార్యం లేక ఇబ్బందులు పడుతున్నాం. ఉదయం 3, సాయంత్రం 3 కిలోమీటర్లు కాలినడకన వెళ్తున్నాం. ఒక్కోసారి తరగతులకు హజరుకాలేకపోతున్నాం. తమ ఇబ్బందులు గుర్తించి బస్సు నడపాలి.

- నిహారిక, ఇంటర్ విద్యార్థిని, గొట్టిముక్కుల

చదువులు ఆగిపోకుండా చూడాలి



మా చదువులు మధ్యలో ఆగిపోకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. లెక్చరర్‌లు క్లాస్‌లు మిస్ కాకుండా కళాశాలకు టైంకు రావాలంటున్నారు. కళాశాలలో లెక్చరర్‌లు చెప్పే ముఖ్యమైన సబ్జెక్ట్‌లతరగతులు మిస్ అవుతున్నాము.

- సాహితి, విద్యార్థిని గొట్టిముక్కుల

కళాశాలకు కాలినడకన వెళ్తున్నాం



మా అమ్మానాన్న వ్యవసాయం చేస్తూ కష్టపడి చదివిస్తున్నారు. కానీ సరైన వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాము. కాలినడకన 6 కిలోమీటర్లు ప్రతి రోజు నడిస్తే అలసిపోతున్నాము. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

- రేణుక, విద్యార్థిని, గొట్టిముక్కుల

ఉత్సవాలకు ఆలయాల ముస్తాబు



నగరంలో విద్యుత్ కాంతుల వెలుగుల్లో దత్త మందిరం

ధర్పల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ధర్పల్లి మండల కేంద్ర శివారులోగల మద్దుల్ అటవీ ప్రాంతంలో వెలసిన శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఉత్సవాలు గురువారం ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం పూజ, అభిషేకం, అర్చన, తదితర కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ధర్పల్లి గ్రామంలోగల శ్రీలక్ష్మినర్సింహస్వామి ఆలయ కమిటీ ఉత్సవాలను నిర్వహించనుందని కమిటీ చైర్మన్ గంగాధర్, వైస్‌చైర్మన్ గంగరాములు తెలిపారు.

నిజామాబాద్ జిల్లాకేంద్రంలో..

దత్త జయంతి వేడుకలకు జిల్లాకేంద్రంలోని దత్తాత్రేయ ఆలయాలు ముస్తాబు అయ్యాయి. ఆలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. గురువారం జయంతి వేడుకలు ప్రారంభం కానుండటంతో ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలోని అతిపురాతనమైన సంత్ ఆచార్య దత్తమందిరం, వర్నిచౌరస్తా వద్ద దత్త హనుమాన్ మందిరం, శిరిడీసాయి కృప కాలనీలోని దత్త ధార్మిక సంస్థ, మల్లారంలోని దత్త ఆశ్రమం, అలీసాగర్‌లోని దత్త ఆలయం, న్యాల్‌కల్‌లోని శబరిమాత ఆలయం, వర్ని, మోస్రా, భీంగల్, మోర్తాడ్, బాల్కొండ, ఆర్మూర్, కమ్మర్‌పల్లి, డిచ్‌పల్లి, బోధన్‌లో దత్త ఆలయాలు వేడుకలకు సిద్ధమయ్యాయి.

చదువుతోనే ఉన్నత భవిష్యత్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి

వేల్పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోనే ఉన్నత భవిష్యత్తు ఉంటుందని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యాబోధన జరుగుతున్న తీరు ను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో చదువు చాలా అవసర మని, విద్య ద్వారానే అన్ని రంగాల్లో రాణిస్తారన్నారు. విద్యా ర్థులు చదువుపట్ల ప్రత్యేకశ్రద్ధ చూపుతూ ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చెడు అలవాట్లకు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంటూ చదువుపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. పాఠశాలలో భోజనం చేశారు. నాణ్యమైన సరుకులతో రుచికరమైన భోజనాన్ని అందించాలన్నారు. అనంతరం గ్రామంలోని గ్రంథాల యాన్ని సందర్శించారు. స్థానిక విద్యార్థులు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సై సంజీవ్, హెచ్‌ఎం రమేష్‌కుమార్, గ్రామ కార్యదర్శి నవనీత, పీడీ గంగధర్, తదితరులున్నారు.

నామినేషన్‌ల స్వీకరణ కేంద్రం పరిశీలన

గ్రామంలోని నామినేషన్‌ల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ఎన్నికల నిబంధనల ప్రకారం అభ్యర్థులు, అధికారులు సహకారించాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై సంజీవ్, తదితరులున్నారు.

స్నేహచంద్రికలు పుస్తక ఆవిష్కరణ

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు రాసిన కథా సంపుటి స్నేహచంద్రికలు పుస్తకాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆవిష్కరించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో ఇందూరు జిల్లా బాలసాహిత్య వేదిక ఆధ్వర్యంలో స్వర్ణ సమత సంపాదకత్వంలో కులాస్‌పూర్ విద్యార్థులు రాసిన ఈ పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తెలుగు సాహిత్యంపై మక్కువ పెంచుకొని తెలుగు సాహిత్యంలో మంచి ప్రతిభను చూపెట్టాలని అన్నారు. ఎంఈవో సాయిరెడ్డి, ఇందూరు బాలసాహిత్య వేదిక అధ్యక్షుడు డా.కాసర్ల నరేష్‌రావు, కోశాధికారి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్, కాంతారావు, ఉమారాణి, స్వర్ణ సమత, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

వర్ని, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వర్ని మండలం జాకోరా సబ్ స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను రేపు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అసిస్టెంట్ ఇంజినీర్, వర్ని కార్యాలయంలో నిర్వహించనున్నామని విద్యుత్ వినియోగదారుల ఫోరంచైర్ పర్సన్ ఎరుకల నారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యక్షంగా ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించబడతాయి. కావున రుద్రూరు సబ్ డివిజన్ పరిధిలోని వర్ని, చందూర్, రుద్రూరు, కోటగిరి, పోతంగల్ సెక్షనన్లకు సంబంధించిన వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ వినియోగదారులు ఈ వేదికను వినియోగించుకొని సమస్యలు పరిష్కరించుకోవాలని తెలియజేశారు.

ఘనంగా న్యాయవాద దినోత్సవం



సీనియర్ న్యాయవాదిని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం న్యాయవాద దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులు, మొదటి రాష్ట్రపతి, న్యాయవాది బాబు రాజేంద్రప్రసాద్ జన్మదినాన్ని జాతీయ న్యాయవాదుల దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం సీనియర్ న్యాయవాదులను పట్టుశాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల శ్రీధర్, జెస్సు అనిల్, గటడి ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

చెట్లను నరికే హక్కు ఎవరిచ్చారు



మునిసిపల్ కార్యాలయాన్ని పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పరిధిలోని ప్రధాన రోడ్ల మధ్య, డివైడర్‌ల మధ్య పదేళ్ల నుంచి పెంచిన చెట్లను నరికే హక్కు ఎవరిచ్చారని, అన్ని ఆధారాలతో సహా పీవీఆర్‌పై ఆరోపణలు చేశానని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి అన్నారు. బుధవారం మునిసిపల్ కార్యాలయాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. మునిసిపల్ కార్యాలయంలో వాయిస్‌తో కూడిన సీసీ కెమెరాల ఏర్పాటులో అంతర్యమేమిటని, అన్ని వర్గాలను బెదిరించి డబ్బులు వసూలుచేసే అధికారం ఎక్కడిదన్నారు. అన్ని ఆధారాలతోనే ఆరోపణలు చేశానని, వాటికి సూటిగా సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ఆర్మూర్ మునిసిపాలిటీలో జరుగుతున్న అవినీతిని వెలికితీయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్,గంగామోహన్ చక్రు, పోల సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, సుంకరి రవి, శ్యామ్, మీర శ్రావన్, జన్నపల్లి రంజీత్, పృథ్వి, మాలిక్‌బాబా ఉన్నారు.

అనుమతులు లేకుండా డ్రోన్‌లతో చిత్రీకరించవద్దు

బోధన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాలలో ప్రభుత్వ అనుమతులు లేకుండా డ్రోన్‌లతో ఎలాంటి చిత్రీకరణ చేయవద్దని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని జాడిజమాల్‌పూర్ గ్రామంలో డ్రోన్‌తో గ్రామ పరిసరాలను చిత్రీకరిస్తున్న డ్రోన్ ఆపరేటర్ ఫయ్యుముద్దీన్‌తో పాటు అతణ్ని పిలిపించి చిత్రీకరిస్తున్న గోగినేని రాజేంద్ర ప్రసాద్‌పై కేసు నమోదు చేశామన్నారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శ్వేత ఫిర్యాదు మేరకు డ్రోన్‌తో చిత్రీకరణపై కేసు నమోదు చేశామన్నారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఎవరు కూడా డ్రోన్‌లతో చిత్రీకరించవద్దన్నారు.

విద్యార్థులు తమను తాము నమ్ముకోవాలి



మాట్లాడుతున్న వీసీ యాదగిరి రావు

సుభాష్‌నగర్: విద్యార్థులు విశ్వవిద్యాలయంలో ఉన్న మౌలికవసతులను ఉపయోగించుకుంటూ విద్యార్థులను తమను తాము నమ్ముకోవాలని మొబైల్ ఫోన్‌లకు దూరంగా ఉంటూ శారీరక, మానసిక శక్తిని పెంచుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ ఆచార్య యాదగిరి రావు అన్నారు. వర్సిటీలో బుధవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఇతరులను నమ్ముకోకుండా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన టీయూ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యసాధనలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్ మామిడాల, వైస్ ప్రిన్సిపాల్ డా.లక్ష్మణ్, ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్, కే.సంపత్‌కుమార్, రవీందర్‌రెడ్డి, లావణ్య, నాగరాజు, జమీల్ అహ్మద్, అబ్దుల్, బాలకిషన్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పీజీ రీవాల్యూయేషన్ నోటిఫికేషన్ విడుదల

ఇందూరు: టీయూ పరిధిలోని పీజీ పరీక్ష పత్రాల రీవాల్యూయేషన్ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పరీక్షల నియం త్రణ అధికారి సంపత్‌కుమార్ తెలిపారు. ఒక పేపర్‌కు రూ.500, దరఖా స్తు ఫారానికి రూ.25 చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుకు డిసెంబరు 8 చివరితేదీ అని తెలిపారు. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులో ఏపీఈ, పీసీహెచ్, ఐఎంబీఏ, 1వ, 3వ, ఎల్‌ఎల్‌బీ 1వ,2వ,3వ,4వ సెమిస్టర్, రెగ్యూలర్, థియరీ- నవంబర్ 2025 పరీక్షలకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోడా నికి అర్హులన్నారు. వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

క్యాంపస్ ముచ్చట్లు

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

టీయూ పరిధిలోని డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య గంటా చంద్రశేఖర్ తెలిపారు. డిగ్రీ సీబీసీఎస్ 1వ, 3వ, 5వ, సెమిస్టర్, 2వ, 4వ, 6వ సెమిస్టర్, బ్యాక్‌లాగ్, థియరీ పరీక్షలు ఉమ్మడి జిల్లాలో 30 సెంటర్‌లలో బుధవారం జరిగాయన్నారు. ఉదయం జరిగిన పరీక్షలకు 2781 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 2538 మంది విద్యార్థులు హాజరుకాగా 242 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరిక్షల్లో 6165 మంది విద్యార్థులు ఉండగా 5856 మంది విద్యార్థులు హాజరుకాగా 309 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ డిచ్‌పల్లిలో ఒకరు డిబార్ అయినట్లు తెలిపారు.

జీజీ కళాశాల డిగ్రీ పరీక్షల్లో ఇద్దరు డిబార్

ఇందూరు: జీజీ కళాశాల డిగ్రీ మొదటి సెమిస్టర్ రెగ్యూలర్ పరీక్షలు, బ్యాక్‌లాగ్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షల్లో ఇద్దరు డిబార్ అయినట్లు ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డా.రంగరత్నం, పరీక్షల నియంత్రణ అధికారి భరత్‌రాజ్ తెలిపారు. మొత్తం 1572 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1524 మంది పరీక్షలు హాజరుకాగా 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.


జైపూర్ కృత్రిమ కాళ్లను వేసుకున్న దివ్యాంగులతో ఎమ్మెల్యే ధన్‌పాల్

రోటరీ క్లబ్‌తో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపుతోందని అర్బన్ ఎమ్మెల్యే దన్‌పాల్ సూర్య నారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని న్యాల్‌కల్‌రోడ్డులో గల రోటరీ క్లబ్ కార్యాలయంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, రోటరీ క్లబ్ ఆఫ్ జగిత్యాల ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఉచిత కృత్రిమ కాళ్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ 2009 నుంచి సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దివ్యాంగులకు కృత్రిమ కాలును అమర్చి వారికి నూతన ఉత్తేజాన్ని కల్పిస్తున్నారన్నారు. దివ్యాంగుల పునరావాసం, సాదికారత కోసం రోటరీ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా నిజామాబాద్ రోటరీ సర్వీసెస్ ట్రస్ట్‌కు ఏటా తమ ట్రస్టు ద్వారా రూ.2లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో చైర్మన్ అశోక్, రోటరీ క్లబ్ ఆఫ్ అధ్యక్షుడు శ్యాం అగర్వాల్, కార్యదర్శి గోవింద్ జవహర్, కోశాధికారి జుగల్ రాజు, బాబురావ్, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

సుభాష్‌నగర్, డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని ఈవీఎం గోదాంను కలెక్టర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ బుధవారం పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా గోదాం సీల్‌ను తెరిపించారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను పరిశీలించారు. గోదాం వద్ద భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించిన కలెక్టర్ నిరంతరం పనిచేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అగ్నిమాపక శాఖ అధికారి పరమేశ్వర్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు ధన్‌వాల్, సిబ్బంది సాత్విక్, విజయేందర్ ఉన్నారు.

విత్తన ముసాయిదాతో కార్పొరేట్లదే పెత్తనం

మోపాల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకురానున్న విత్తన ముసాయిదా చట్టం వల్ల కార్పొరేట్‌దే పెత్తనం అవుతుందని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూర్ భూమయ్య అన్నారు. మోపాల్ మండల కేంద్రంలోని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని విత్తనాలు నేటికి 90 శాతం ప్రైవేటు కార్పొరేట్ బహుళజాతి కంపెనీ చేతుల్లోనే ఉన్నాయని, ప్రభుత్వం 10 శాతం మాత్రమే సప్లై చేస్తున్నాయన్నారు. ఈనెల 11 వరకు ముసాయిదా విత్తనచట్టం తీసుకురావడానికి ప్రభుత్వం రైతుల అభిప్రాయాలు సేకరిస్తుందని దీన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలి
- అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాలలో విజయాలను సాధించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. జిల్లా మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఆయా రంగాల్లో దివ్యాంగులు ప్రదర్శిస్తున్న ప్రతిభా పాటవాలను గుర్తు చేస్తూ వారిని కొనియాడారు. విద్యా, రాజకీయ రంగాలతో పాటు క్రీడలు, ఉన్నత ఉద్యోగాలు, వ్యాపారాలు ఇలా ఏ రంగంలో చూసినా దివ్యాంగులు సమాజంలోని ఇతరులకు ఏమాత్రం తీసిపోకుండా తమ ప్రతిభను చాటుకుంటున్నారన్నారు. ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల కోసం ఉద్దేశించిన భవిత కేంద్రాలను జిల్లాలో అన్ని వసతులతో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. భవిత కేంద్రాలతో పాటు నిజామాబాద్ నగరంలో దివ్యాంగుల కోసం ఉద్దేశించిన వసతిగృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెడ్ క్రాస్, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అనాథ వృద్ధుల కోసం నిర్వహించబడుతున్న వృద్ధాశ్రమాన్ని కూడా అవసరం ఉన్న వారు వినియోగించుకునేలా చూడాలన్నారు. దివ్యాంగులకు జిల్లా యంత్రాంగం తరపున పూర్తి సహాయ సహకారం అందిస్తామని, సదరం సర్టిఫికెట్ల జారీలో ఇబ్బందులు ఉంటే తొలగిస్తామన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన దివ్యాంగులను సత్కరించి ప్రశంసాపత్రాలు బహూకరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. నగరంలోని దివ్యాంగుల సంఘాలకు మెప్మా ఆధ్వర్యంలో రూ.12.5 లక్షల విలువ చేసే చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సెర్ప్ రాష్ట్ర డైరెక్టర్ కృష్ణమూర్తి, డీడబ్ల్యూఓ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ రాజశ్రీ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, మమత, సైకియాట్రిస్ట్ డాక్టర్ రవితేజ, దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధిక సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.


ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి


పోలీసులు తిరిగి అప్పగించిన మొబైల్ ఫోన్‌లను చూపిస్తున్న బాధితులు

170మంది బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

సుభాష్‌నగర్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ డివిజన్ పరిధిలో పోగొట్టుకున్న, చోరీకి గురైన సుమారు 17లక్షల విలువ గల 170 మొబైల్ ఫోన్‌లను బాధితులకు ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి జిల్లా కమిషనరేట్‌లో బుధవారం అందజేశారు. ఈ సందరంగా ఏసీపీ రాజవెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం మొబైల్‌ఫోన్ లేనిది చిన్న లావాదేవిలు కూడా చేయలేని పరిస్థితి ఉందన్నారు. విలువైన సమాచారం, బ్యాంక్ అకౌంట్స్, పాస్‌వర్డ్‌లాంటివి మొబైల్ ఫోన్‌లలో సేవ్ చేసుకుంటారని తెలిసిన నేరగాళ్లు ఫోన్‌పే, గూగుల్‌పే తదితర మాధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్‌లేకాకుండా వ్యక్తిగత సమాచారంతో పాటు డబ్బులను కూడా కోల్పోతారన్నారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్న, దొంగిలించబడిన వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో బ్లాక్ చేసి సంబంధిత పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రజలు ఎవరైనా సెకండ్ హ్యాండ్ ఫోన్‌లు కొనుగోలు చేస్తే యజమాని నుంచి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

రేవంత్‌రెడ్డి హిందువులకు క్షమాపణ చెప్పాలి

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి హిందూ దేవతలను అవమానించేలా చేసిన వాఖ్యలు క్షమించలేనివని వెంటనే రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని నిఖిల్‌సాయి చౌరస్తా వద్ద బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దినేష్‌కులాచారి మాట్లాడుతూ.. గతంలో కేసీఆర్ హిందువులను అవమానిస్తూ పాతర వేశారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి అదే దుస్థితి పడుతుందన్నారు. రేవంత్ రాజకీయాలు ఒక వర్గం ఓట్ల కోసం చేస్తున్న నాటకమని విమర్శించారు. ఒక వర్గం మన్ననలు పొందడానికి హిందువులను బాధించే వాఖ్యలు చేయడం కాంగ్రెస్‌కు సంప్రదాయం అయిందని అన్నారు. హిందుభావాలను రెచ్చగొట్టేల ప్రవర్తిస్తే బీజేపీ పార్టీ జిల్లావ్యాప్తంగా పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, వినోద్, కిషోర్, మల్లేష్‌గుప్త, రాజు, అంబదాస్, గిరిబాబు, నరేష్, విజయ్‌కృష్ణ, ఆనంద్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు సుమన్

సమస్యల పరిష్కారానికి కృషి

- టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్

సుభాష్‌నగర్,డిసెంబరు3(ఆంధ్రజ్యోతి): వసతి గృహ అధికారుల సమస్య పరిష్కారానికి రాష్ట్ర నాయకులతో మాట్లాడి కృషి చేస్తానని టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని టీఎన్‌జీవోస్ కార్యాలయంలోని బీ.స్వామినాథమ్ సమావేశ మందిరంలో వసతిగృహ అధికారుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీఎన్‌జీవోస్ అధ్యక్షుడు సుమన్ హాజరై మాట్లాడారు. వసతిగృహ అధికారుల సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర నాయకుల సమన్వయంతో వసతి గృహ అధికారుల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. దీర్ఘకాలికంగా ఉన్న వసతిగృహ స్కావెంజర్‌లకు నిధులు, నూతన భవనాల నిర్మాణం, హాస్టల్ నిధులు తదితర సమస్యలపై చర్చిస్తానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు బాస్కర్, మచ్చేందర్, టీఎన్‌జీవోస్ రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, వసతిగృహ అధికారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునిల్, రామప్ప, నరేష్, అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, సంయుక్త కార్యదర్శులు పద్మ, కార్యవర్గ సభ్యులు స్వామి, సలహాదారులు సుధాకర్, వసతి గృహ అధికారుల సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు సురేష్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

3 పంచాయతీలు.. ముగ్గురే అభ్యర్థులు

- పాల్దా, ధర్మారం తండా, లింగితండాల్లో ఒక్కొక్క నామినేషన్ దాఖలు
- దాదాపు ఏకగ్రీవం అయినట్లే
- అధికారికంగా ప్రకటించడమే తరువాయి

నిజామాబార్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో సర్పంచ్ ఎన్నికల్లో మూడు గ్రామపంచాయతీల్లో ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలయ్యాయి. సర్పంచ్ ఎన్నికల కోసం నవంబరు 30, డిసెంబరు 1, డిసెంబరు 2న నామినేషన్ పత్రాలు స్వీకరించారు. అయితే మండలంలోని 19 గ్రామ పంచాయతీల్లో నామినేషన్లు దాఖలయ్యాయి. పాల్ద, ధర్మారం తండా, లింగితండా గ్రామ పంచాయతీల్లో మాత్రం ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దాంతో ఈ మూడు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయినట్లే. ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. ఈ మూడు గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు ముగ్గురూ యువతీయవకులు కావడం గమనార్హం. వీరు గతంలో ఎలాంటి పోటీల్లో పాల్గొనలేదు. వీరికి ఇదే తొలిసారి. మొదటిసారి ఎన్నికల్లో నిలబడిన మొదటిసారే ఏకగ్రీవ సర్పంచ్‌లుగా ఎన్నికైన వారవుతారు. పాల్ద గ్రామానికి చెందిన మున్నూరు ప్రభాకర్, ధర్మారం తండాకు చెందిన బాదావత్ కల్పన, లింగి తండాకు చెందిన మాలావత్ రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ గ్రామస్థులు తీర్మానంచేఏశారు. ఇందులో తండాలు చిన్న ఇటీవల ఏర్పడ్డ కొత్త గ్రామ పంచాయతీలు కాగా, పాల్ద మాత్రం 2వేల ఓట్లు కలిగిన మేజర్ గ్రామ పంచాయతీ కావడం గమనార్హం.


విలేకరులతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నగేష్‌రెడ్డి

ఓటు చోరీకి పాల్పడుతున్న బీజేపీ

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి

నిజామాబాద్ రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని, ఓటు చోరీకి పాల్పడతు అధికారంలోకి వస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కాటిపల్లి నగేష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం డిచ్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మొన్న బిహార్‌లో జరిగిన ఎన్నికల్లో ఓట్లు చోరీ చేసి అధికారంలోకి వచ్చారని మండిపడ్డారు. బ్రెజిల్ దేశానికి చెందిన ఒక నటికి సంబంధించి దాదాపు 22 ఓట్లు ఉన్నాయని, ఆమె భారతదేశ పౌరురాలు కానప్పటికి ఆమెకు ఓటు హక్కు కల్పించారని తెలిపారు. నకిలీ ఓట్లు సృష్టించి బిహార్‌లో అధికారంలోకి వచ్చిందన్నారు. హర్యానాలో దాదాపు 25లక్షల ఓట్లకుగాను 12.5%నకిలీ ఓట్లు పోలయ్యాయన్నారు. ఎలక్షన్ కమీషన్‌కు తెలిసే కేంద్రం ఆడుతున్న నాటకాలు అని మండిపడ్డారు. త్వరలో జరగబోయే తమిళనాడు, వెస్ట్ బెంగాల్ రాష్ట్రాల్లో కూడా దొడ్డిదారిన గెలవాలని యత్నిస్తుందన్నారు. రాహుల్‌గాంధీ ప్రజలను చైతన్యవరుస్తున్నారని, సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉంటారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో సర్పంచ్‌లను గెలిపించుకుంటామన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి విక్కీయాదవ్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విపుల్ గౌడ్, జిల్లా ఎస్టీసెల్ అధ్యక్షుడు యాదగిరి, డిచ్‌పల్లి మాజీ ఎంపీపీ నర్సయ్య, గంగాధర్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్ రైల్వే స్టేషన్ ఎదుట ఎండలో నిలుచున్న ప్రయాణికులు

నిలువ నీడ లేదాయే..

నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఎదుట ఆర్టీసీ బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు ప్రారంభమైన నాటి నుంచి ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూసేందుకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదు. కొన్ని రోజులు తాత్కాలికంగా షెడ్‌ను ఏర్పాటు చేసిన ఆర్టీసీ అధికారులు కొంతకాలం క్రితం అదికూడా తీసేసారు. రోజూ మధ్యాహ్నం ఎండ వేడిమి తట్టుకోలేక అవస్థలు పడుతున్నారు. బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తున్న ప్రయాణికులకు కనీసం కూర్చుండడానికి కుర్చీలైనా ఏర్పాటు చేయలేదు. రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ, రైల్వే అధికారులు తాత్కాలికంగా ప్రయాణికుల కోసం షెడ్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

- సుభాష్‌నగర్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

నిజామాబాద్ రూరల్, డిసెంబరు3 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలోని ముబారక్ నగర్‌లోని ఆర్‌బీవీఆర్ఆర్ పాఠశాలలో బుధవారం విజ్ఞాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను సందర్శించారు. ఎల్‌కేజీ నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుల్లో విద్యార్థులు పలు విభాగాల్లో ప్రాజెక్టులు చేశారు. వైద్య సంబంధిత పరీక్షలను ప్రదర్శించారు. బ్లడ్‌టెస్టుప్రక్రియను పరిశీలించి అభినందించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులుతమకు ఇష్టమైన రంగాల్లో తమఅభిరుచికి అనుగుణంగా మెళకువలు మెరుగుపరచుకోవాలని అన్నారు. విద్యార్థులకు ఉన్న అన్ని అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు ప్రవీణ్‌రెడ్డి, కార్యదర్శి వెంకటరమణరెడ్డి, స్కూల్ చైర్మన్ జగత్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రాజెక్టులను తిలకిస్తున్న డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి

ఆర్మూర్ బల్దియాలో అక్రమాలు ఎన్నో

(5వ పేజీ తరువాయి)

వెంచర్‌లకు ఇంటి నంబర్‌లు ఇవ్వవద్దనే నిబంధనలు ఉన్నా వాటన్నింటిని ఇటీవల ఏసీబీకి పట్టుబడిన మున్సిపల్ కమిషనర్ రాజు అందినకాడికి దండుకుని ప్రజాప్రతినిధుల అండతో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. దొంగ ఇంటి నంబర్‌లతో రిజిస్ట్రేషన్ అయిన వాటిని సైతం రద్దు చేయాలని మున్సిపల్ పాలకవర్గం సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు రాయడం కూడా జరిగింది. దొంగ ఇంటి నంబర్‌ల వ్యవహారంలో కీలకపాత్ర పోషించిన మాజీ ప్రజాప్రతినిధి భర్త ఈ వ్యవహారంలో రెండు అపార్ట్‌మెంట్‌లలో ప్లాట్లను కూడా గిఫ్ట్‌గా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సైతం అనేక అక్రమాలు జరిగినట్లు సమాచారం.

విద్యాసంస్థలపై ఏసీబీ తనిఖీలు సరికాదు

సుభాష్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి నవ సమాజ నిర్మాణానికి పాటుపడుతున్న విద్యాసంస్థల్లో ఏసీబీ దాడులు చేయడం సమాజానికి చెడు సంకేతాలను అందిస్తుందని పీఆర్‌టీయూ అధ్యక్ష కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్‌లు అన్నారు. జిల్లాకేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని పీఆర్‌టీయూ భవన్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలోకి వెళ్లి ఏసీబీ దాడులు చేయడం వల్ల అక్కడ ఉన్న విద్యార్థులు అనవసర భయాలను పెంచుకునే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులు ఏదో తెలియని తప్పు చేస్తున్నారని విద్యార్థులు ఒకరకమైన తప్పుడు భావనలతో ఉపాధ్యాయులను అర్థం చేసుకునే ప్రమాదం ఉందన్నారు. కేజీబీవీలో జరిగిన ఏసీబీ దాడి వల్ల పాఠశాలలోని బాలికలు విపరీతమైన భయభ్రాంతులకు గురికావడం ఆందోళనకు గురిచేస్తుందన్నారు. పీఆర్‌టీయూ జిల్లా పక్షాన ఇటువంటి చర్యలను నిరసిస్తుందన్నారు. విద్యాశాఖలో ఏవైనా లోపాలు ఉంటే విద్యాశాఖ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్, ఆర్‌జేడీలు, విద్యాశాఖ అధికారి, ఎంఈవోలతో తనిఖీలు చేయించాలని ఏసీబీతో విద్యాసంస్థలను తనిఖీ చేయించడం బాధాకరమన్నారు.



నిరసన తెలుపుతున్న పీఆర్‌టీయూ నాయకులు

ఘనంగా పడిపూజ

సిరికొండ, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చిన్నవాల్గోట్‌లో బుధవారం అయ్యప్ప స్వాములు పడిపూజను ఘనంగా నిర్వహించారు. శివాలయం నుంచి అయ్యప్ప స్వామిని పల్లకీ లో ప్రతిష్ఠించి గ్రామంలో శోభాయాత్రను నిర్వహించారు. భక్తులు స్వామి సేవలో తరించారు.


పడిపూజలో పాల్గొన్న భక్తులు

మొదటి విడత ప్రచారం షురూ..

(5వ పేజీ తరువాయి)

వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. వారం రోజుల గడువే ఉండడంతో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో అభ్యర్థులు ఉన్నారు.

మొదలైన మూడో విడత నామినేషన్ల స్వీకరణ

ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ ముగియగా రెండో విడత నామినేషన్ల పరిశీలన బుధవారం ముగిసింది. మూడో విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. జిల్లాలో మూడో విడత నామినేషన్‌ల ప్రక్రియకు సంబంధించి 12మండలాల్లో 165 గ్రామ పంచాయతీలు, 1620 వార్డులకు నామినేషన్‌లను స్వీకరిస్తున్నారు. ఈ నెల 5వరకు నామినేషన్‌ల గడువు ఉంది. జిల్లాలో మూడు విడతలకు సంబంధించి పంచాయతీ ఎన్నికల కోలాహలం గ్రామాల్లో మొదలైంది. మొదటి విడతలో 22 గ్రామ సర్పంచ్ స్థానాలతో పాటు వంద లాది వార్డులు ఏకగ్రీవం కాగా రెండో విడతలోనూ సర్పంచ్, వార్డు స్థానాలను ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మూడో విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్‌లకు శుక్రవారం వరకు గడువు ఉండడంతో అధికంగా నామినేషన్లు దాఖలయ్యే అవకాశాలు ఉన్నాయి.

శ్రీకాంతాచారి ఆత్మబలిదానంతోనే స్వరాష్ట్రం

నిజామాబాద్ సిటీ, డిసెంబర్ 03 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మలిదశ ఉద్యమంలో ఆత్మత్యాగానికి పాల్పడ్డ శ్రీకాంతచారి వర్ధంతిని నిర్వహించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని శ్రీకాంతచారి విగ్రహానికి జిల్లా ఓబీసీ నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాజనరేందర్ గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తొలి ఆత్మబలిదానం చేసుకున్న శ్రీకాంతాచారి త్యాగం వృథా కాలేదని పేర్కొన్నారు. ఆయన ఆత్మబలిదానంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్నారు.


నివాళులు అర్పిస్తున్న నాయకులు

నిజామాబాద్ కల్చరల్: తెలంగాణ ఉద్యమం సమయంలో తన ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుడు శ్రీకాంతాచారికి విశ్వబ్రాహ్మణ సంఘం నివాళులర్పించింది. బుధవారం వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సత్యప్రకాశ్, రాష్ట్రకార్యదర్శి లక్ష్మణచారి మాట్లాడుతూ శ్రీకాంతచారి లాంటి ఎందరో త్యాగాలతోటే తెలంగాణ ఏర్పడిందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసచారి, స్వర్ణకార సంఘ అధ్యక్షుడు సదానంద్, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఏడంతస్తులా..?

(5వ పేజీ తరువాయి)

వస్తుంది. వీరు ఏ చిన్నపనికైనా కిందికి రావాల్సి ఉండడంతో లిఫ్టులను ఆశ్రయించాల్సి వస్తుంది. కేవలం రెండు లిఫ్టులే పనిచేయడంతో రోగులకు, వారి సహాయకులకు ఇబ్బందిగా మారింది. ఏ పరీక్షలు కావాలన్నా రోగులు కింది అంతస్తు నుంచి పై అంతస్తు వరకు తిరగాల్సి వస్తుంది. టెస్టులన్నీ ఒకే ఫ్లోర్‌లో లేకపోవడంతో నిత్యం లిఫ్టును ఆశ్రయిస్తున్నారు. లిఫ్టులు పనిచేయకపోవడంతో పై అంతస్తులకు వెళ్లడం రోగులకు ఇబ్బందిగా మారింది. ఉన్న రోగం కంటే మెట్లు ఎక్కే భారమే తలనొప్పిగా మారింది.

సినిమా గైడ్


దేవి : రాజు వెడ్స్ రాంబాయి (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఆంధ్రకింగ్ తాలూకా (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : తేరే ఇష్క్‌మే(11.15 9.15) : బిజినెస్‌మ్యాన్(2.15, 6.15)
లలితామహాల్: రివాల్వర్ రీటా (11.15, 2.15, 6.15, 9.15)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్

స్క్రీన్-1 : ఆంధ్రకింగ్ తాలూకా (10.40, 1.30, 4.30, 7.30)
: రాజు వెడ్స్ రాంబాయి (10.20)
స్క్రీన్-2 : రాజు వెడ్స్ రాంబాయి (11.00, 1.30, 4.30, 7.30, 10.20)
స్క్రీన్-3 : జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (11.00)
: తేరే ఇష్క్ మీన్ (హిందీ) (1.20, 4.20, 7.20, 10.30)

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణుమాల్)

స్క్రీన్-1 : జూటోపియా-2 (తెలుగు 3డి) (11.00)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (1.30)
: ఆంధ్రకింగ్ తాలూకా (4.00, 7.20, 10.40)
స్క్రీన్-2 : ఆంధ్ర కింగ్ తాలూకా (10.30, 1.50)
: రంగ్‌లీలా (హిందీ) (5.10)
: జూటోపియా-2 (ఇంగ్లీష్ 3డి) (8.10)
: రాజు వెడ్స్ రాంబాయి (10.40)
స్క్రీన్-3 : జనతాబార్(10.30),తేరేఇష్క్‌మిన్(హిందీ)(1.10,7.30, 11.00)
: బిజినెస్‌మెన్ (4.40)
స్క్రీన్-4 : తేరే ఇష్క్ మిన్ (హిందీ) (10.30)
: రాజు వెడ్స్ రాంబాయి 4.50, 7.40),
: రివాల్వర్ రీటా (10.30)



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.1,29,500	రూ.1,19,300	రూ.1805

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.150	రూ.260	రూ. 280
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.270	రూ. 290

